క్లుప్తంగా

మహిళా సాధికారతను సాధించాలి



అవగాహన కల్పిస్తున్న మౌనిక

మంచిర్యాలటౌన్: మహిళలు వారికి కల్పిస్తున్న రక్షణ చట్టాలు తెలుసుకోవాలని, మహిళా సాధికారతను సాధించేలా ముందుకు నడవాలని మహిళాశిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక అన్నారు. భేటి బచావో–భేటీ పడావో పథకం, గర్భస్థ శిశువు లింగనిర్ధారణ చట్టం, లింగ వివక్షత, బాల్య వివాహాలు నిరోధక చట్టంపై శుక్రవారం సత్యం కంప్యూటర్స్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్‌క్రైమ్, మహిళా హెల్ప్‌లైన్ 1930, సఖీ సర్వీస్ హెల్ప్‌లైన్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14567 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు.

పొగాకు గుట్కా అమ్మితే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నర్సింహులు

జన్నారం: కిరాణా షాపుల్లో ప్రభుత్వ నిషేధిత వస్తువులు పొగాకు, గుట్కా అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నర్సింహులు హెచ్చరించారు. మండల కేంద్రంలో వ్యాపారులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడుంబా తయారీకి నల్లబెల్లం పటిక షాపుల్లో దొరికితే కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణాల్లో 20 కిలోలకు మించి బెల్లం ఉండొద్దని, కిలో బెల్లం విక్రయించిన వారి ఆధార్, ఫోన్ నంబర్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు ఒజ్జల వామన్, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పరిశీలన



పరిశీలిస్తున్న నోడల్ అధికారి రమేశ్ రాథోడ్

కాసిపేట: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులను శుక్రవారం మండల నోడల్ అధికారి రమేశ్ రాథోడ్ పరిశీలించారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ బస్తీ, మహేంద్రబస్తీ ఇతర పాఠశాలల్లోఎలక్ట్రిసిటీ, మైనర్ రిపేర్ టైల్స్ వాటర్ పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని హెచ్ఎంలు, కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్‌కు సూచించారు.

మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీ రికార్డులు పరిశీలిస్తున్న శివరాం

తాండూర్: రాబోయే సీజన్‌లో నాటే మొక్కలను లక్ష్యానికి అనుగుణంగా సిద్ధం చేయాలని డీఆర్డీఏ అంబుడ్స్‌మెన్ కె.శివరాం పేర్కొన్నారు. మండలంలోని తాండూర్ పంచాయతీ నర్సరీని శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. హరితహారం కార్యక్రమానికి సరిపోయే మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఉపాధి హామీ రిజిస్టర్లను పరిశీలించారు. టీసీఎస్ రాజ్‌కుమార్, ఈజీఎస్ టీఏలు రాజేంద్రప్రసాద్, భార్గవ్, పంచాయతీ కార్యదర్శి తపస్ కుమార్ తదితరులు ఉన్నారు.

సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాలి

శ్రీరాంపూర్: కార్మికులకు సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు గొల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా చీటీలు పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. దీంతో కార్మికుల ఖాతాలో ఎంత ఉందో అర్థం తెలియక గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. సీఎంపీఎఫ్ సేవలను ఆన్‌లైన్‌లో చేస్తున్నామని అధికారులు పేర్కొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కాని ఇప్పటికి అమలుకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే సింగరేణి అధికారులు సీఎంపీఎఫ్ శాఖ అధికారులతో మాట్లాడి చీటీలను పంపిణీ చేయించాలని కోరారు.

సారూ.. బడి తరలించరూ..!

- ఒకే భవనం.. మూడు పాఠశాలలు
- ఇరుకు గదిలో విద్యాబోధన
- తల్లిదండ్రుల విన్నపం



మూడు పాఠశాలలు ఇదే భవనంలో..

మంచిర్యాలఅర్బన్: పాఠశాలలు పున:ప్రారంభానికి ఆరు రోజులే మిగిలిఉంది. ఓ వైపు బడిబాట కార్యక్రమం మొదలెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి..అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన విద్యనందించేలా ముందుకు సాగుతున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులున్నాయి. సర్కారు బడులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. ఇంతవరకు బాగున్నా పాఠశాలల్లో వసతులు అంతంత మాత్రమే ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇరుకు గదుల్లో విద్యాబోధన సాగుతుంది. ఒకే భవనంలో మూడు పాఠశాలలు.. ఒకే తరగతిలో ఐదేసి తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. ఇక్కడ నిర్వహించే ఎంఈవో కార్యాలయాన్ని పాత డీఈవో ఆఫీసు (బాలుర ఉన్నత పాఠశాల భవనం) ఇలా ఖాళీ అయిందో లేదో చకచకా తరలించారు. విద్యార్థులకు ఇబ్బందిగా మారిన సర్కార్ బడి (స్టేషన్‌రోడ్) పాఠశాలను తరలింపునకు మాత్రం చొరవ చూపడం లేదు. తల్లిదండ్రులు ఎప్పుడు అడిగినా నాలుగురోజులు ఆగండి..తరలిస్తామని చెబుతూ దాటవేస్తుండటంతో ఏయేటి కాయేడు విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు.

విద్యార్థులకు దూరభారం?

విద్యార్థులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో సర్కారు పాఠశాలలు ఏర్పాటు చేసిన అధికారులు అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారుతున్నాయి. వెనకాముందు ఆలోచించకుండా అన్నింటిని ఒకే చోటుకి తరలించారే తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం విద్యార్థులకు ఆర్థికభారంగా మారుతుంది. స్టేషన్‌రోడ్ పాఠశాల, రాళ్లపేట్ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి పాఠశాలలకు రావడానికి ఆటోలు ఆశ్రయిస్తున్నా వారు కొందరైతే, వారి తల్లిదండ్రులు దింపి వెళ్తున్నారు మరికొందరు. నడిచి వచ్చే వారు ఇంకొందరు. ఆటోలు వచ్చి వెళ్లడానికి దాదాపు నెలకు దూరాన్ని బట్టి రూ.300 నుంచి రూ.700 ఖర్చు చేస్తున్నారు. ఈ పాఠశాలలు దూరంగా ఉండటంతోనే విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం ఇరుకు గదిలో ఐదు తరగతుల నిర్వహణతో రెండు వైపులా పిల్లలను కూర్చోబెట్టి ఆ టీచరు చెప్పే పాఠాలు విద్యార్థులకు ఎలా బోధపడుతుందో అధికారులకే తెలియాలి. పట్టణ ప్రాంతమైన ప్రభుత్వ పాఠశాలలకు దగ్గరలోనే ఉంటే రావడం కష్టమవుతున్న ఈరోజుల్లో ఎక్కడో కి.మీ దూరంలో పాఠశాలలకు ఎట్లా వస్తారో అధికారులకే తెలియాలి.

స్టేషన్ రోడ్ పాఠశాలల తరలింపు ఎప్పుడో?

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోకి స్టేషన్‌రోడ్ పాఠశాలను తరలించాలనే విద్యాశాఖాధికారులు సముఖత వ్యక్తం చేశారు. జాఫర్‌నగర్, జన్మభూమినగర్ తదితర ప్రాంతాల విద్యార్థులకు అనువుగా ఉంటుందని లెక్కలు వేశారు. ఇదివరకు పాత డీఈవో కార్యాలయం భవనంలోకి (బాయ్స్ హైస్కూల్ భవనం) మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఏమైందో ఏమోగానీ ఇంతవరకు పాఠశాల తరలింపునకు నోచుకోలేదు. హరిజనవాడలో ఉన్న ఎంఈవో కార్యాలయం తరలింపుపై ఉన్నా శ్రద్ధ..పాఠశాల తరలింపుపై లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పున:ప్రారంభానికి ముందే పాఠశాలను విద్యార్థులకు అందుబాటులో ఉండేలా (తరలిస్తే) చర్యలు చేపడితే విద్యార్థులకు ఉపయోగం మారనుంది.

ఒకే భవనంలో మూడు పాఠశాలలు..

జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్ అనుకుని హరిజనవాడ పాఠశాలను ఏర్పాటు చేశారు. అక్కడ నాలుగు తరగతి గదులు నిర్మించారు. మొదట్లో ముగ్గురు టీచర్లతో బాగానే బోధన జరిగింది. కాలక్రమేపీ విద్యార్థుల సంఖ్య తగ్గడం.. ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయక పోవడంతో ఒకే గదిలో ఐదు తరగతులకు ఇద్దరు టీచర్లతో పాఠశాల సాగుతుంది. ఇదే పాఠశాల భవనంలోనే రాళ్లపేట్ రోడ్‌లోని స్టేషన్‌రోడ్ పాఠశాలను అక్కడ భవన యాజమాని ఖాళీ చేయించడం..పలు కారణాలతో ఇక్కడకు తరలించారు. ఓ గది కేటాయించి చేతులు దులుపుకున్నారు. మరో గదిలో రాళ్లపేట్ పాఠశాలకు ఓ గదిని కేటాయించారు. ఇలా ఒక్కో గదిని ఒక్కో పాఠశాలకు కేటాయించారు. ఒకే భవనంలో మూడు గదుల్లో మూడు పాఠశాలలు కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మహేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బెల్లంపల్లి:పట్టణశివారులోని 33/11 కేవీ శివాలయం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బెల్లంపల్లి డిస్కం ఏడీఈ కె.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి బస్తీ, మహ్మద్ ఖాశీం బస్తీ, బూడిదగడ్డబస్తీ, శంషీర్‌నగర్, హన్మాన్ బస్తీ, రాంనగర్, అశోక్‌నగర్, రడగంబాలబస్తీ, ఇంక్లైన్‌బస్తీ, బాబు క్యాంపు బస్తీ, ఏఎంసీ ఏరియా, సుభాష్‌నగర్ బస్తీ, శాంతిఖని బస్తీ, 65 డీప్ ఏరియాలతోపాటు బుధాకుర్దు, చాకేపల్లి, బుధాకలాన్, చంద్రవెల్లి, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, లంబాడి తండా గ్రామాల్లో, 11 కేవీ ఆకెనపల్లి ఫీడర్‌లో ఉన్న గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కాసిపేట: మండలంలోని 33/11 కేవీ కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని ఏఈ స్వర్ణలత తెలిపారు.

దండేపల్లి: ముత్యంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతు నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాయనర్సు తెలిపారు.

మందమర్రిరూరల్: అందుగులపేట సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పలు ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. జీఎం ఆఫీస్ ఏరియా, యాపల్, కేకే 2, ఊరు మందమర్రి, టోల్‌ప్లాజా, మార్కెట్‌ఏరియా, దీపక్‌నగర్, పాలచెట్టు, దొర్లబంగ్లా, ఊరు రామకృష్ణాపూర్, పాకిస్థాన్ క్యాంపు, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వర్‌రావు పల్లె, బొక్కలగుట్టతోపాటు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నస్పూర్: 33 కేవీ, ఆర్కే–6 సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా నస్పూర్‌పరిధిలోని అన్ని వార్డుల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ రామూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చినందున గనిపై ఉండే గదులు కురుస్తున్నాయని, వెంటనే పై కప్పులు మరమ్మతు చేయించాలన్నారు. కార్మికులకు పని చేసేటప్పుడు రక్షణ కోసం గ్లౌజులు పంపిణీ చేయాలన్నారు. ఎస్‌డీఎల్ యంత్రాల స్పేర్ పార్ట్స్ కొరత ఉందని వెంటనే తీర్చాలన్నారు. మెటీరియల్ సరఫరా సరిగా ఉండడం లేదని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు తిరుపతిరెడ్డి, లాగల శ్రీనివాస్, గణపతి, మహేశ్, వెంకటేశ్వర్లు, జక్కుల సాగర్, ఫిట్ సెక్రటరీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

జన్నారం: జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకుందామని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు డేగ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ హాల్‌లో శుక్రవారం టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. అక్రిడిటేషన్ కార్డుల తోపాటు, హెల్త్ కార్డులు అందజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, సంయుక్త కార్యదర్శి సత్యం, కార్యవర్గ సభ్యుడు లింగన్నను జిల్లా కమిటీ సన్మానించింది. టీయూడబ్ల్యూజే కోశాధికారి వంశీకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, సురేశ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు మల్లేశం, కిరణ్, సతీశ్, రమేశ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం జరిగేలా చూస్తాం



జాయింట్ సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు

భీమిని: అర్హులైన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. కన్నెపల్లి మండలంలోని కొత్తపల్లి శివారులో శుక్రవారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన రైతులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు కొందరికి పట్టాలు లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ విషయమై రైతులు పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జాయింట్ సర్వే చేపట్టారు. ఆయన వెంట ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు, నాయకులు ఉన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్వీ శ్రీకాంత్

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, ప్రభుత్వమే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మార్క్స్‌భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్లు చేసుకుని ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యారంగ సంస్థలను బలోపేతం చేయాలన్నారు. ఖాళీగా ఉన్నా టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్, జిల్లా నాయకులు శంకర్, రాజ్‌కుమార్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ

బెల్లంపల్లిరూరల్: రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జెడ్పీ వైస్ చైర్మన్ టి.సత్యనారాయణ అన్నారు. బెల్లంపల్లి మండలంలోని బుచ్చయ్యపల్లి పంచాయతీ నుంచి మందమర్రి మండలం చతులాపూర్ గ్రామం వరకు రూ.2.8 కోట్ల నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టి గడువులోగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు దారి కష్టాలు లేకుండా చూడాలన్నారు. అధికారులు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆకెనపల్లి ఎంపీటీసీ పి.సుభాష్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌గౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, రాజశేఖర్, ప్రభాకర్, రమేశ్, రాజయ్య ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్, ఎల్కపల్లి, చేడ్వాయి, గొంట్లపేట్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీవిద్య, గౌసియా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో ప్రతి కొనుగోలు, విక్రయాలకు రికార్డులు నమోదు చేయాలని సూచించారు. ప్రతీ కొనుగోలుకు రైతులకు రశీదులు అందించాలన్నారు.

కొనసాగుతున్న బడిబాట



తాండూర్: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



రామకృష్ణాపూర్: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో చేపడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ముల్కల్ల, దొనబండ, రాపల్లి, సబ్బెపల్లి, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట చైతన్య ర్యాలీ నిర్వహిస్తూ ప్రైవేట్‌కు దీటుగా సర్కారుబడిలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యార్థులకు అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ గురించి వివరించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు విన్నవించారు. హెచ్ఎంలు బొమ్మ గణపతిరెడ్డి, హన్మాండ్లు, సుధారాణి, సఫ్దర్‌అలీఖాన్, ఉపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. పెద్దంపేటలోని కొలాంగూడలోని గిరిజనుల పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చైతన్యం చేసి ప్రవేశం కల్పించారు.

తాండూర్: మండలంలోని కిష్టంపేట, తంగళ్లపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, హెచ్ఎంలు శుక్రవారం ఇంటింటికి వెళ్లి విద్యార్థులు తల్లిదండ్రులను కలిశారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మల్లేశం, పాఠశాల హెచ్ఎం మాసాడి శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ప్రియాంక ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లారు. బడీడు పిల్లలను గుర్తించి ప్రవేశం కల్పించారు. ఉపాధ్యాయులు సురేష్ బాబు, అబ్దుద్‌పాషా, లచ్చన్న, రాజేష్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పాఠశాల నుంచి ర్యాలీ చేపట్టి ఇంటింటా విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే కలిగే లాభాలను వివరించారు. కాగా, క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మురళీకృష్ణ బడిబాట కార్యక్రమంపై కౌన్సిలర్లకు అవగాహన కల్పించారు.



కాసిపేట: దేవాపూర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దీపక్‌కుమార్

బెల్లంపల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న క్రమంలో జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు, తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేయడానికి సిద్ధమయ్యాయని తెలిపారు. ఆయా విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు పేరిట విద్యార్థుల నుంచి రూ.వేల చొప్పున వసూళ్లు చేస్తున్నాయన్నారు. సరైన అనుమతులు, వసతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.

కాలువకు మరమ్మతు



భీమిని: మండలంలోని బిట్టూర్‌పల్లి పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ నాయకుల చొరవతో శుక్రవారం కాలువకు మరమ్మతు చేపట్టారు. కాలువ ప్రతీ వర్షాకాలం తెగిపోయి పొలాలు నీట మునుగుతున్నాయి. ఈ విషయమై రైతులు కాంగ్రెస్ మండల నాయకుడు లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కన్నెపల్లి ఎంపీపీ మాదవరపు సృజన–నర్సింగరావు దృష్టికి తీసుకెళ్లి వెంటనే స్పందించి సొంతఖర్చులతో మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా రైతులు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ ఎంపిక జాబితా

కాసిపేట:మండలంలోని మోడల్‌స్కూల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందే విద్యార్థుల జాబితాను కాలేజీ నోటీసు బోర్డుపై ఉంచామని పేర్కొన్నారు. మెరిట్ జాబితాలో సీటు సాధించిన విద్యార్థులు, టీసీ బోనోఫైడ్ కులధ్రువీకరణ పత్రాలతో ఈనెల 8 నుంచి 11లోపు అడ్మిషన్ పొందాలని కోరారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఐఎస్, సీఆర్పీలు

దండేపల్లి: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి మండలంలోని ప్రభుత్వ పాఠశాల పాఠ్యపుస్తకాలు దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయానికి రావడంతో, వాటిని పాఠశాలల హెచ్ఎంలకు శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలు అందించారు. ఎంఐఎస్ నగేశ్, సీసీవో మల్లేశ్, సీఆర్పీలు సురేందర్, నర్సయ్య, రమేశ్, రాజ్‌మహమ్మద్, శ్రావణ్, మెసెంజర్ పోచన్న పాల్గొన్నారు.